సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

ఆదివారం | 17 | మార్చి | 2024



ఆనందాల 'గృహజ్యోతి'
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గృహజ్యోతి పథకంలో భాగంగా 200 యూనిట్లలోపు వాడుకున్న వినియోగదారులకు జీరో బిల్లులు జారీ అయ్యాయి. - 8లో▸



'ఇంటర్ స్పాట్' బహిష్కరణ
చీఫ్ ఎగ్జామినర్లుగా తమను నియమించడం లేదని నిరసిస్తూ మోడల్ స్కూల్ అధ్యాపకులు ఆందోళన చేశారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
36^0 / 23^0

వాతావరణం
జిల్లాలో ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై పలు చోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. రాత్రి చల్లగాలులు వీస్తాయి.

ఇఫ్తార్	సహర్
ఆది 6:32	సోమ 5:00

రంజాన్ వేళలు

ఇక.. దూకుడు..!



మోగిన ఎన్నికల నగారా.. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదల

- ఏప్రిల్ 18న నోటిఫికేషన్.. 25 వరకు నామినేషన్లు
- మే 13న పోలింగ్..
- ఉమ్మడి జిల్లా పరిధిలో రెండు పార్లమెంట్ స్థానాలు
- మొత్తంగా 33.43 లక్షల మంది ఓటర్లు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు..
- అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్

సాక్షిప్రతినిధి, వరంగల్: అందరూ ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ రానే వచ్చింది. మే 13న వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఇక ప్రధాన రాజకీయ పార్టీలు తమతమ అభ్యర్థులను బరిలో నిలిపి దూకుడుగా ముందుకు సాగనున్నాయి. పార్లమెంట్ ఎన్నికలకు ఎప్పుడైనా నోటిఫికేషన్ రావొచ్చన్న సంకేతాలతో ఉమ్మడి వరంగల్‌లో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా అధికారులు ఓటర్ల నమోదు ప్రక్రియ ఇప్పటికే పూర్తి చేశారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎంల) పరిశీలన, ఓటర్ల సౌకర్యాల కల్పనపై పోలింగ్ కేంద్రాల తనిఖీలు నిర్వహించారు. రెండు పార్లమెంట్ నియోజకవర్గాల్లోని సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి ఆమేరకు ఏర్పాట్లు చేశారు. కాగా.. ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ఎన్నికల షెడ్యూల్ శనివారం విడుదల కాగా.. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

రెండు 'పార్లమెంట్'లకు షెడ్యూల్ ఇలా...

వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో అధికారులు ఇటీవల విడుదల చేసిన జాబితా ప్రకారం మొత్తం ఓటర్ల సంఖ్య 33,42,746గా ఉంది. వరంగల్ ఎంపీ పరిధిలో 18,16,609 మంది ఉండగా, మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో 15,26,137 మంది ఓటర్లున్నారు. వీరి కోసం వరంగల్‌లో 1,893 పోలింగ్ కేంద్రాలు, మహబూబాబాద్ పరిధిలో 1,783 కేంద్రాలను ఏర్పాటు చేసిన అధికారులు దివ్యాంగులు ఓటేసేందుకు వెసులుబాటు, ప్రత్యేక సదుపాయాలను కల్పించారు. ఏప్రిల్ 18న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుండగా.. రెండు పార్లమెంట్ నియోజకవర్గాల్లో అదే రోజు నుంచి 25 వరకు నామినేషన్లు స్వీకరించి 26వ తేదీ వరకు పరిశీలించి పోటీలో ఉన్న అభ్యర్థుల పేర్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ప్రకటిస్తారు.

మే 13న పోలింగ్ జరగనుండగా.. ఏప్రిల్ 29న నామినేషన్ల ఉపసంహరణ తర్వాత అభ్యర్థులు ప్రచారాన్ని హోరెత్తించనున్నారు. నామినేషన్ల ఉపసంహరణ నుంచి పోలింగ్ జరిగే ఒక్కరోజు ముందే ప్రచారానికి తెరపడనుండగా.. నామినేషన్ల ఉపసంహరణ తర్వాత 12 రోజుల పాటు ప్రచారం నిర్వహించే అవకాశం ఉంది.

ప్రచారానికి రంగం సిద్ధం

పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రధాన పార్టీలు ప్రచారాన్ని హోరెత్తించేందుకు అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకుంటున్నాయి. బీఆర్‌ఎస్ నేతలే లక్ష్యంగా ఇప్పటికే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు గాలం వేస్తుండగా.. శనివారం ఎన్నికల షెడ్యూల్ విడుదలతో ఆ వేగం మరింత పెరిగింది. అయితే కీలక నేతలు చేజారకుండా ఆయా పార్టీల అధిష్టానాలు బుజ్జగింపులు కొనసాగిస్తున్నాయి. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో.. మహబూబాబాద్ పార్లమెంట్ స్థానం కోసం కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు పోరిక బలరాం నాయక్, అజ్మీరా సీతారాం నాయక్, మాలోతు కవితను అభ్యర్థులుగా ప్రకటించగా... వరంగల్‌కు బీఆర్‌ఎస్ పార్టీ మాత్రమే తమ అభ్యర్థిగా కడియం కావ్యను ఖరారు చేసింది. కాంగ్రెస్, బీజేపీలు సైతం త్వరలోనే అభ్యర్థులను ప్రకటించేందుకు నియోజకవర్గాల నేతలతో సమాలోచనలు చేస్తున్నాయని, రెండు మూడ్రోజుల్లో కొలిక్కివస్తాయని ఆయా పార్టీల నాయకులు చెబుతున్నారు.

తనిఖీలు షురూ..

- బార్డర్ చెక్‌పోస్టు ప్రారంభం



కాళేశ్వరంలో బార్డర్ చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేపడుతున్న పోలీసులు

కాళేశ్వరం: ఎన్నికల కోడ్ రావడంతో తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దుల్లోని కాళేశ్వరం వద్ద అంతర్రాష్ట్ర వంతెన సమీపంలో బార్డర్ చెక్‌పోస్టును పోలీసులు ప్రారంభించారు. సీఐ రాజేశ్వర్‌రావు, కాళేశ్వరం ఎస్సై పీవీఎస్ భవానిసేన్ ఆధ్వర్యంలో తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌ల నుంచి వచ్చి వాహనాలను నిలిపి క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. ఎస్సై మాట్లాడుతూ డబ్బు, మద్యం, మత్తుపదార్థాలు, ఓటర్లను ప్రలోబపెట్టే ఉచితాలను అక్రమంగా రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు చేపడతామన్నారు. వాహనాలు సీజ్‌చేస్తామన్నారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకు రాత్రి, పగలు తనిఖీలు ఉంటాయన్నారు.

లోక్ సభ స్థానం-వరంగల్ (ఎస్సీ)

నియోజకవర్గం (అసెంబ్లీ)	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు	ఇతరులు
స్టేషన్‌ఘన్‌పూర్ (ఎస్సీ)	290	1,24,669	1,27,948	01
పాలకుర్తి	294	1,26,261	1,28,533	13
పరకాల	239	1,08,159	1,14,105	02
వరంగల్ పశ్చిమ	245	1,38,673	1,43,111	14
వరంగల్ తూర్పు	230	1,24,733	1,31,435	339
వర్ధన్నపేట(ఎస్సీ)	278	1,33,541	1,38,520	17
భూపాలపల్లి	317	1,36,640	1,39,889	06
మొత్తం	1,893	8,92,676	9,23,541	392

లోక్ సభ స్థానం మహబూబాబాద్ (ఎస్టీ)

నియోజకవర్గం (అసెంబ్లీ)	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు	ఇతరులు
డోర్నకల్(ఎస్టీ)	256	1,09,140	1,13,244	07
మహబూబాబాద్ (ఎస్టీ)	283	1,26,417	1,31,382	46
నర్సంపేట	283	1,14,971	1,20,024	09
ములుగు(ఎస్టీ)	303	1,13,262	1,18,594	27
పినపాక(ఎస్టీ)	241	99,525	1,03,189	05
ఇల్లెందు(ఎస్టీ)	241	1,09,699	1,14,704	04
భద్రాచలం(ఎస్టీ)	176	72,702	79,179	07
మొత్తం	1,783	7,45,716	7,80,316	105

ఏసీబీ ప్రత్యేక కోర్టు ప్రారంభం అనంతరం కార్యకలాపాలు నిర్వహించిన జిల్లా ఇన్‌చార్జ్ జడ్జి జి.ప్రేమలత, చిత్రంలో రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ ఆరాధే, న్యాయమూర్తులు



కోర్టులను సద్వినియోగం చేసుకోవాలి

వరంగల్‌లో ఏసీబీ ప్రత్యేక కోర్టుతోపాటు హనుమకొండ జిల్లాకు సబ్ కోర్టు, ఉభయ జిల్లాలకు ఈ–సేవా కేంద్రం, పూర్వ రికార్డులు భద్రపర్చడం కోసం డిజిటలైజేషన్ కేంద్రాన్ని రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ ఆరాధే శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ టి.వినోద్‌కుమార్, జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ ఎస్.రాజేశ్వర్‌రావు, వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు కె.రాధాదేవి, ఎం.కృష్ణమూర్తి పాల్గొన్నారు. కోర్టులను సద్వినియోగం చేసుకోవాలని న్యాయవాదులను కోరారు.

- వరంగల్ లీగల్ - వివరాలు 8లో▸

జాతీయ లోక్ అదాలత్‌కు విశేష స్పందన



కక్షిదారులకు పత్రం అందజేస్తున్న వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.రాధాదేవి

వరంగల్ లీగల్: వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయ సేవా సదనం భవనంలో ప్రధాన న్యాయమూర్తులు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ కె.రాధాదేవి, యం.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌కు అపూర్వ స్పందన లభించింది. ముఖ్య అతిథులుగా జడ్జి రాధాదేవి, యం.కృష్ణమూర్తి, వై.సత్యేంద్ర, వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.సాయి కుమార్, హనుమకొండ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జె.ఉపేందర్ రావు, కలెక్టర్ సిక్తా పట్నాయక్ హాజరై జాతీయ లోక్ అదాలత్‌ను ప్రారంభించారు. వరంగల్ జిల్లాలో 9 బెంచ్‌లను ఏర్పాటు చేసి మొత్తం 4,713 పెండింగ్ కేసులను పరిష్కరించారు. ఇందులో సివిల్ కేసులు 49, ఎంవీఓపీ కేసులు 28 (రూ. 1,40,92,176) క్రిమినల్ కేసులు, 4664, బ్యాంకు పీఎల్‌సీ కేసులు 5 (రూ.21,20,000) బీఎస్‌ఎన్‌ఎల్ 13 కేసులకు పరిష్కారం చూపారు. హనుమకొండ జిల్లాలో 9 బెంచ్‌లు ఏర్పాటు చేసి మొత్తం 3,501 పెండింగ్ కేసులను పరిష్కరించారు. ఇందులో సివిల్ కేసులు 39, యంవీఓపీ 24 కేసులు (రూ.1,13,75,000) క్రిమినల్ కేసులు 3455, బీఎస్‌ఎన్‌ఎల్ పీఎల్‌సీ 7 కేసులు (రూ. 10,965) పరిష్కరించినట్లు తెలిపారు. ఎలుకుర్తి ఆనంద్ మోహన్, జి.శ్రీధర్‌రెడ్డి తదితరులుపాల్గొన్నారు.

కమిషనరేట్‌లో ఆ ఇద్దరు ఎవరు?

- ఫోన్ ట్యాపింగ్‌లో మనవాళ్ల పాత్ర?

వరంగల్ క్రైం: రాష్ట్రంలో ప్రకంపనలు సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం వరంగల్ పోలీస్ కమిషనరేట్‌ను తాకింది. స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్‌బీఐ)లో డీఎస్పీగా పనిచేసి కాంగ్రెస్ నేతల ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడి సస్పెండ్ అయిన దుగ్యాల ప్రణీత్‌రావు అరెస్టు.. వాంగ్మూలం తరువాత పరిణామాలు వేగంగా మారుతున్నాయి. ట్యాపింగ్‌పై ప్రణీత్‌రావు నుంచి కూపీ లాగగా వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన ఇద్దరు ఇన్‌స్పెక్టర్ల పాత్ర కూడా ఉన్నట్లు బయటపడిందని సమాచారం. ఆఇద్దరు ఇన్‌స్పెక్టర్లు ఎవరనేది శనివారం కమిషనరేట్‌లో హాట్ టాపిక్‌గా మారింది. గత ప్రభుత్వంలో పని చేసిన మంత్రి సహకారంతో ఆ ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు.. కాంగ్రెస్ నేతలు, అధికారులు, అప్పటి అధికార పార్టీ ఎమ్మెల్యేల ఫోన్‌లు, వారి సహాయకుల ఫోన్లను ట్యాపింగ్ చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై రెండు మూడు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉందని పోలీస్ అధికారులు భావిస్తున్నారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి కాంటాక్టు తరగతులు

కేయూ క్యాంపస్: కేయూ పరిధి దూర విద్యా కేంద్రంలో ప్రవేశాలు పొందిన డిగ్రీ సెకండియర్, ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ఈనెల 17 నుంచి కాంటాక్టు తరగతులు నిర్వహించనున్నట్లు దూరవిద్య కేంద్రం డైరెక్టర్ రాంచంద్రం శనివారం తెలిపారు. యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఈ తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

45 మంది గైర్హాజరు

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలో శనివారం నిర్వహించిన ఇంటర్మీడియట్ ఒకేషనల్ కోర్సుల్లో 45 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఐఈఓ గోపాల్ తెలిపారు. మొత్తంగా 655 మంది విద్యార్థులు హాజరవ్వాల్సి ఉండగా.. 610 మంది హాజరైనట్లు, 45 మంది గైర్హాజరైనట్లు గోపాల్ తెలిపారు.

మాడవీధుల నిర్మాణం షురూ..



హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయంలో మాడవీధుల నిర్మాణ పనుల్ని శనివారం ప్రారంభించారు. 'కుడా' అధికారులు అజిత్ రెడ్డి, భీంరావు, ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ శేషుభారతి పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు చేసి నిర్మాణ పనుల్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఈఓ శేషుభారతి మాట్లాడుతూ.. ఎన్నికల నోటిఫికేషన్ వస్తే పనులు ప్రారంభించడం ఆలస్యమవుతుందని వెంటనే పనులు ప్రారంభించాల్సిందిగా రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, హనుమకొండ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆదేశించినట్లు తెలిపారు. నిర్మాణం పనుల్లో భాగంగా ట్రాక్టర్ మట్టితో తోయను నింపారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

సర్వే చేపడతాం..

సాక్షి ఎఫెక్ట్

హన్మకొండ చౌరస్తా: 'గుట్టలనూ వదలట్లేదు' శీర్షికన శనివారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి పద్మాక్షి ఆలయ ఈఓ పెండోటి ప్రసాద్ స్పందించారు. 7వ డివిజన్ లక్ష్మీపురంలోని స్వామి వివేకానంద పాఠశాల వెనుకాల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఇంటి నంబర్లు లేకుండా నిర్మిస్తున్న తీరును పరిశీలించిన ఆయన దేవాదాయ, ధర్మాదాయ శాఖకు చెందిన ల్యాండ్ సర్వే ఇన్‌స్పెక్టర్‌చేత సర్వే చేయించి, పూర్తి నివేదికను దేవాదాయశాఖ ఉన్నతాధికారులకు అందజేస్తానన్నారు. చారిత్రక పద్మాక్షి గుట్టలను అన్యాక్రాంతం చేయాలని చేస్తే ఊరుకునేది లేదని, అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కాంగ్రెస్‌లోకి 'పుల్లా'



హన్మకొండ చౌరస్తా: మాజీ ఎమ్మెల్సీ పుల్లా పద్మావతి కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్ రెడ్డి నివాసంలో శనివారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పుల్లా పద్మావతి, భాస్కర్ దంపతులు, 54, 61వ డివిజన్ కార్పొరేటర్లు గుంటి రజిత, ఎలిగింటి రాములు రేవంత్‌రెడ్డిని కలిశారు. సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, జక్కుల రవీందర్, విజయశ్రీరజాలీ, మామిళ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంవీఐ శ్రీనివాస్ బదిలీ

ఖిలా వరంగల్: వరంగల్ రవాణాశాఖలోని ఎంవీఐ శ్రీనివాస్ ఆదిలాబాద్ జిల్లా ఆర్టీఏకు బదిలీ అయ్యారు. సిరిసిల్లా నుంచి ఎంవీఐ శోభన్ బాబు, భద్రాద్రి కొత్తగూడెంనుంచి ఎంవీఐ జైపాల్‌రెడ్డి వరంగల్ జిల్లా ఆర్టీఏ కార్యాలయానికి బదిలీ చేస్తూ శనివారం రాత్రి రవాణాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఓటు చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలి



మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన అధికారులు

హన్మకొండ అర్బన్: లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో.. స్వీప్ ఆధ్వర్యంలో ఓటు హక్కు ప్రాముఖ్యాన్ని తెలిపేలా కార్యక్రమాలు నిర్వహించాలని, వీటిలో యువత, విద్యార్థులను భాగస్వామ్యం చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కార్యక్రమంలో విద్యార్థుల్ని భాగస్వామ్యం చేసేందుకు వారికి క్విజ్, వ్యాసరచన, తదితర పోటీలు నిర్వహించాలన్నారు. జిల్లాలో పోలింగ్ శాతం పెంచేందుకు విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మోడల్ పోలింగ్ కేంద్రాలు గుర్తించాలని, సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రాధికాగుప్తా, ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, డీపీఓ లక్ష్మీరామాకాంత్ , డీఆర్డీఓ, నాగపద్మజ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

- కలెక్టర్ ప్రావీణ్య



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ప్రావీణ్య

కరీమాబాద్: ఎన్నికల కోడ్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. భారత ఎన్నికల సంఘం పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్, డీజీపీ రవిగుప్తాతోపాటు ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వరంగల్ కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ప్రావీణ్య, పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్‌ఝా, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, నర్సంపేట ఆర్డీఓ కృష్ణవేణి, నోడల్ అధికారులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ప్రావీణ్య సంబంధిత జిల్లా అధికారులతో మాట్లాడారు. ఎన్నికల కోడ్ నిబంధనలపై ఎప్పటికప్పుడు రాజకీయ పార్టీలకు సమాచారం అందించాలని, ప్రభుత్వ వెబ్‌సైట్‌లలో ముఖ్యమంత్రి, మంత్రుల ఫొటోలను తొలగించాలని ఆదేశించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- మేయర్ గుండు సుధారాణి
- ఘనంగా మహిళా దినోత్సవం



వరంగల్ అర్బన్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. శనివారం గ్రేటర్ వరంగల్ ప్రధాన కార్యాలయం కౌన్సిల్ హాల్‌లో మహిళా దినోత్సవ-24 వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. క్రీడా పోటీల విజేతలకు మేయర్, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే కలిసి బహుమతులు ప్రదానం చేశారు. ఈసందర్భంగా మేయర్ సుధారాణి మాట్లాడుతూ.. మహిళలు ఆర్థిక పురోభివృద్ధి సాధించాలన్నారు. అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ.. వరంగల్ ఉమ్మడి జిల్లా నుంచి ఇద్దరు మహిళా మంత్రులు, హనుమకొండ, వరంగల్ జిల్లాల పాలనాధికారులుగా మహిళలు, నగర ప్రథమ పౌరురాలిగా మహిళ ఉండడం, గ్రేటర్ కమిషనర్‌గా తాను రావడం గర్వంగా ఉందన్నారు. క్రీడా పోటీల విజేతలకు మహిళా కార్పొరేటర్లకు, ఉద్యోగినులకు, మెప్మా సిబ్బందికి మేయర్, కమిషనర్ చేతుల మీదుగా బహుమతులు అందించారు. కార్యక్రమంలో మహిళా కార్పొరేటర్లు పల్లం పద్మ, ముష్కమల్ల అరుణ, తూర్పాటి సులోచన, దివ్య రాణి, జక్కుల రజిత, జన్ను షిబారాణి, గుజ్జుల వసంత తదితరులున్నారు.

బీఆర్‌ఎస్‌కు అరూరి రమేశ్ రాజీనామా!

పార్టీ అధినేత కేసీఆర్‌కు లేఖ పంపిన మాజీ ఎమ్మెల్యే

- వారం రోజుల హైడ్రామాకు ఎట్టకేలకు తెర
- నేడు బీజేపీలో చేరనున్న రమేశ్.. వరంగల్ ఎంపీ అభ్యర్థిగా ప్రకటన?



సాక్షిప్రతినిధి, వరంగల్: బీఆర్‌ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ ఆ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, పదవులకు రాజీనామా చేశారు. ఈమేరకు గులాబీ దళపతి, మాజీ సీఎం కేసీఆర్‌కు శనివారం సాయంత్రం తన రాజీనామా లేఖ పంపారు. ఇంతకాలం పార్టీలో కొనసాగడానికి, వివిధ పదవుల ద్వారా ప్రజలకు సేవచేసే అవకాశం కల్పించినందుకు మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ఇతర బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా రమేష్ బీఆర్‌ఎస్‌ను వీడనున్నారన్న ప్రచారం నెల రోజులుగా సాగుతోంది. పార్టీ మారడం లేదని పదే పదే ఆయన ఖండించినా.. వారం రోజులుగా జరుగుతున్న పరిణామాలతో ఇరకాటంలో పడ్డారు. అటు బీఆర్‌ఎస్‌లో కొనసాగలేక.. ఇటు బీజేపీలో చేరలేక అంతర్మథనంలో పడ్డారు. ఈనెల 12వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించిన బీజేపీ బహిరంగసభలో పాల్గొనేందుకు వచ్చిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను ఐటీసీ కాకతీయ హోటల్‌లో కలిశారు. అమరుసటి రోజు 13న హనుమకొండ ప్రశాంత్‌నగర్‌లో వివరాలు వెల్లడించేందుకు ప్రెస్ మీట్ ఏర్పాటు చేశారు. ఇదే సమయంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య తదితర నేతలు రమేశ్ ఇంటి నుంచి తమ వాహనాల్లో హైదరాబాద్‌కు తరలించి కేసీఆర్‌ను కలిపించారు. ఆరోజు ఉమ్మడి వరంగల్ ముఖ్యనేతలతో భేటీ నిర్వహించిన కేసీఆర్ మాజీ మంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూతురు కావ్యను వరంగల్ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించారు. దీంతో అరూరి ఆ మరుసటి రోజు ఉదయమే బీఆర్‌ఎస్ శిబిరం వీడి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి డైరెక్షన్‌లో బీజేపీ అగ్రనేతలను కలిసేందుకు ఢిల్లీకి వెళ్లారు. అమరుసటిరోజే ప్రధానమంత్రి నరేంద్రమోదీ మల్కాజ్‌గిరి ఏరియాలో రోడ్‌షో నిర్వహించేందుకు హైదరాబాద్ పర్యటనకు రానున్న నేపథ్యంలో ఆయనను కలిసేందుకు సిద్ధమయ్యారు. ఒకవేళ కుదరని పక్షంలో మళ్లీ ఢిల్లీ వెళ్లాలని నిర్ణయించుకున్న ఆయన, ప్రధాని మోదీ, జేపీ నడ్డా, అమిత్‌షాలను కలిసే ముందే శనివారం పార్టీకి సభ్యత్వానికి పదవులకు రాజీనామా చేశారు. ఈ మేరకు కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ చీఫ్, ఇతర ముఖ్యనేతలతో కలిసి ఆయన బీజేపీ పార్టీలో ఆదివారం ఉదయం 10 గంటలకు చేరనున్నట్లు ఆయన అనుచరవర్గాల సమాచారం. అంతేగాకుండా అదేరోజు గానీ, మరుసటి రోజు కానీ వరంగల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థిగా ప్రకటించే అవకాశం ఉంది.

'పది'కి సర్వం సిద్ధం

జిల్లాలో 68 పరీక్ష కేంద్రాలు

- నాలుగు సెల్ఫ్ సెంటర్లు
- పరీక్ష రాయనున్న 12,032 మంది విద్యార్థులు
- 314 మంది ప్రైవేట్ అభ్యర్థులు
- పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్.. 'సీసీ నిఘా' ఏర్పాటు



విద్యారణ్యపురి: ఈనెల 18నుంచి ఏప్రిల్ 2 వరకు నిర్వహించనున్న టెన్త్ పరీక్షలకు జిల్లా విద్యాశాఖ అధికారులు సర్వం సిద్ధం చేశారు. జిల్లాలో రెగ్యులర్ విద్యార్థులు మొత్తం 12,032 మంది పరీక్షలు రాయనున్నారు. ప్రైవేట్ అభ్యర్థులు 314 మంది రాయబోతున్నారు. పరీక్షల నిర్వహణకు 68 కేంద్రాలను ఏర్పాటు చేశారు. 44 ప్రభుత్వ యాజమాన్యాలకు సంబంధించిన హై స్కూళ్లు, మరో 24 ప్రైవేట్ హైస్కూళ్లను పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. 68 మంది చీఫ్ సూపరింటెండెంట్లను, 68 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లను నియమించారు.

కేంద్రాల వద్ద 144 సెక్షన్

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. జిరాక్స్ సెంటర్లను మూసివేయనున్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు.

నిమిషం నిబంధన లేదు..

టెన్త్ విద్యార్థులకు ఈసారి నిమిషం నిబంధన లేదు. పరీక్ష ప్రారంభమైన 5 నిమిషాల వరకు చేరుకునే అవకాశం ఉంటుంది. ప్రతీ పరీక్ష కేంద్రంలో ఒక్కో సీసీ కెమెరాను ఏర్పాటు చేశారు. సీసీ నిఘాలోనే చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ ప్రశ్నపత్రాలు విప్పుతారు. జవాబు పత్రాలను కూడా సీసీ కెమెరాల నిఘాలోనే ప్యాక్ చేస్తారు.

మూడంచెల భద్రత

హనుమకొండ జిల్లాలోని అన్ని కేంద్రాల్లో పకడ్బందీగా పరీక్షలను నిర్వహించేలా నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్లను నియమించారు. ప్రతీ కేంద్రానికి సిట్టింగ్ స్క్వాడ్లు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల్లో పోలీస్ శాఖ ఇతర శాఖలతో కలిపి లోపల బయట మూడంచెల భద్రత వ్యవస్థను ఏర్పాటు చేశారు. తొలిసారిగా జిల్లాలో అన్ని పరీక్ష కేంద్రాల వద్ద పంచాయతీరాజ్, వ్యవసాయశాఖకు సంబంధించిన ఉద్యోగులు పర్యవేక్షించేలా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. ఒక్కో కేంద్రం వద్ద పోలీస్ సిబ్బందితోపాటు ఇద్దరు ఉద్యోగులు ఉంటారు. గతేడాది కమలాపూర్ హైస్కూల్‌లో జరిగిన ఘటనను దృష్టిలో ఉంచుకొని కలెక్టర్ ఈ నిర్ణయం తీసుకున్నారు.

నాలుగు సెల్ఫ్ సెంటర్లు

హనుమకొండ జిల్లాలో దామెర, సిద్ధాపూర్, పెద్ద పెండ్యాల, శనిగరం జిల్లా పరిషత్ హైస్కూల్లో సెల్ఫ్ సెంటర్లు ఏర్పాటు చేశారు. జిల్లాలోనే సమస్యాత్మక కేంద్రంగా కమలాపూర్ జిల్లా పరిషత్ బాయ్స్ హైస్కూల్ పరీక్షా కేంద్రాన్ని గుర్తించారు. ఈసారి ప్రత్యేక నిఘా ఉండనుంది.

విద్యార్థులకు ఏమైనా సందేహాలున్నా.. సమాచారం కావాలన్నా **62819 85031** నంబర్‌లో సంప్రదించవచ్చు

వరంగల్ జిల్లాలో 9,455 మంది విద్యార్థులు

కాశిబుగ్గ సెంటర్: పదో తరగతి వార్షిక పరీక్షలకు వరంగల్ జిల్లా విద్యాశాఖ అధికారులు సర్వం సిద్ధం చేసినట్లు డీఈఓ వాసంతి తెలిపారు. జిల్లాలో మొత్తం 54 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. 287 పాఠశాలలకు చెందిన 9,455 మంది రెగ్యులర్ విద్యార్థులు ఉండగా ఇందులో 4,831 బాలురు, 4,624 బాలికలు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. ఇందులో 82 మంది ప్రైవేట్ అభ్యర్థులు ఉన్నారని తెలిపారు. ఏమైనా సందేహాలుంటే 89199 74862లో సంప్రదించాలని సూచించారు.

నామినేటెడ్ పదవుల్లో ఉమ్మడి జిల్లా నేతలకు చోటు

- నలుగురికి కీలక కార్పొరేషన్లు
- 'కుడా' చైర్మన్‌గా ఇనుగాల
- జంగా, ప్రకాశ్‌రెడ్డి, బెల్లయ్య నాయక్‌లకు స్టేట్ పదవులు



వెంకట్రాంరెడ్డి రాఘవరెడ్డి ప్రకాశ్ రెడ్డి



బెల్లయ్యనాయక్

సాక్షిప్రతినిధి, వరంగల్: కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పెద్ద సంఖ్యలో నామినేటెడ్ పదవుల భర్తీకి శ్రీకారం చుట్టింది. ఒకేసారి 37 రాష్ట్రస్థాయి కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించగా అందులో ఉమ్మడి జిల్లా నేతలు నలుగురికి చోటు లభించింది. హనుమకొండ జిల్లా పరకాల అసెంబ్లీ టికెట్ రేసు నుంచి తప్పుకుని అక్కడ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేసిన అసెంబ్లీ ఇన్‌చార్జ్ ఇనుగాల వెంకట్రాంరెడ్డిని కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్మన్‌గా, జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డిని తెలంగాణ కోఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోయర్స్ ఫెడరేషన్ చైర్మన్‌గా నియమించారు. అదే విధంగా మహబూబాబాద్ అసెంబ్లీ నుంచి టికెట్ ఆశించి అధిష్టానం సూచన మేరకు వెనక్కి తగ్గిన ఆదివాసీ సంఘ నేత బెల్లయ్యనాయక్‌కు టీజీ గిరిజన కోఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఇచ్చారు. కాంగ్రెస్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు అయిత ప్రకాశ్‌రెడ్డిని రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించారు.

పైస్థాయి అధికారిని కాపాడే యత్నం

- కిందిస్థాయి ఆఫీసర్‌ను బలి చేసే వ్యూహం

హన్మకొండ : విద్యుత్ టవర్లు నిర్మించి వృథాగా వదిలేసి.. నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డ డివిజన్ స్థాయి అధికారిని కాపాడేందుకు కింది స్థాయి అధికారిని బలిచేయాలని చూస్తున్నట్లు ఆ శాఖ ఉద్యోగ వర్గాల్లో గుసగుసలు వినవస్తున్నాయి. గతంలో జనగామ డివిజన్ అధికారిగా విధులు నిర్వర్తిస్తూ తన పరిధి కానీ, హనుమకొండ రూరల్ డివిజన్ నిరూప్‌నగర్‌లో నూతన విద్యుత్ లైన్ నిర్మాణ పనులు మంజూరు చేశారు. మొత్తంగా రూ.50 లక్షల ప్రజా ధనాన్ని వృథా చేశారు. ఆయనకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా యాజమాన్యం ఉత్తమ అధికారిగా ఎంపిక చేసి ప్రశంసపత్రం అందించారు. సదరు డివిజన్ ఇంజనీర్‌కు అక్రమాల్లో అతని ప్రమేయం లేదని చూపించడానికి కింది స్థాయి అధికారిని ఇందులో బలి చేయాలని చూస్తున్నారని సమాచారం. కొంతమంది ఇన్‌చార్జ్ డైరెక్టర్లు సైతం డీఈపై క్లీన్‌చీట్ ఇచ్చారు. ఇదే విషయంపై 'పరిధి దాటి పనులు' అనే శీర్షికతో ఈ నెల 5న సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్ రెడ్డి తదుపరి చర్యలకు ఆదేశించారు. ఈ క్రమంలో టవర్ల నిర్మాణంలో ప్రధాన కారకుడైన డీఈని తప్పించేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది.

ఆనందాల 'గృహజ్యోతి'

అర్హులకు జీరో బిల్లులు జారీ

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 12,03,156 మంది గృహ వినియోగదారులు
- అర్హత సాధించిన సర్వీస్‌లు 4,50,923
- జారీ చేసిన బిల్లులు 4,47,729
- జీరో బిల్లులు 4,37,008
- అర్హులైనా జీరో బిల్లు రాని సర్వీస్‌లు 10,721
- ఇంకా జారీ కావాల్సిన బిల్లులు 3,194



హన్మకొండ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గృహజ్యోతి పథకంలో భాగంగా 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడుకున్న వినియోగదారులకు జీరో బిల్లులు జారీ అయ్యాయి. ప్రతి నెల 15వ తేదీలోపు టీఎస్ ఎన్పీడీసీఎల్ మీటర్ రీడింగ్ నమోదు చేసి విద్యుత్ బిల్లులు, నోటీసు జారీ చేస్తుంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం మార్చి నెల నుంచి గృహజ్యోతి పథకం అమలు చేస్తుండడంతో ఈ మాసానికి ప్రత్యేకత ఉంది. రాష్ట్రంలో తాము అధికారంలోకి వస్తే గృహాలకు 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తామని ఎన్నికల్లో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. వాగ్దానం మేరకు అధికారంలోకి వచ్చిన అనంతరం గృహజ్యోతి పథకాన్ని మార్చి నెల నుంచి అమలు చేస్తున్నట్లు ప్రకటించి అర్హులకు జీరో బిల్లులు జారీ చేసింది. కాగా, ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న తెల్లరేషన్ కార్డు వినియోగదారులకు మొదటి విడతలో మార్చి నెలలో జీరో బిల్లులు జారీ సింది. 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించుకుంటే బిల్లు చెల్లించాల్సిన



అవసరం లేదు.

పెండింగ్‌లో 3,194 సర్వీస్‌ల బిల్లులు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 12,03,156 గృహ విద్యుత్ వినియోగదారులున్నారు. ఇందులో మొదటి విడతలో అర్హత సాధించిన గృహజ్యోతి సర్వీస్‌లు 4,50,923 ఉన్నాయి. ఇందులో 4,47,729 సర్వీస్‌లకు బిల్లులు జారీ అయ్యాయి. 4,37,008 మంది విద్యుత్ వినియోగదారులు 200 లోపు యూనిట్లు విద్యుత్ వినియోగించడంతో వీరికి జీరో బిల్లులు జారీ చేశారు. గృహజ్యోతి పథకానికి అర్హులై ఉండి 200 యూనిట్లకు పైగా విద్యుత్ వినియోగించుకున్న 10,721 మంది వినియోగదారులకు సాధారణ బిల్లులు జారీ అయ్యాయి. 200 యూనిట్లకు పైగా విద్యుత్ వాడుకున్న వీరు బిల్లులు చెల్లించాల్సిందే. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇంకా 3,194 సర్వీస్‌ల బిల్లులు జారీ కావాల్సి ఉంది. ఇందులో అత్యధికంగా భూపాలపల్లి సర్కిల్‌లో 3156 సర్వీస్‌లకు బిల్లింగ్ కాలేదు. మహబూబాబాద్‌లో ఆరు సర్వీస్‌లు, వరంగల్ జిల్లాలో 32 సర్వీస్‌లకు బిల్లులు జారీ చేయాల్సి ఉంది. హనుమకొండ, జనగామ జిల్లాలో గృహజ్యోతి పథకంలోని అన్ని సర్వీస్‌లకు బిల్లులు జారీ అయ్యాయి.

జీరో బిల్లు రాని అర్హులకు మరో అవకాశం..

జీరో బిల్లు రాని, తెల్ల రేషన్ కార్డు కలిగిన వినియోగదారులు తమ వివరాలు నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఫోన్‌నంబర్, విద్యుత్ సర్వీస్ కనెక్షన్ నంబర్ వివరాలతో కూడిన ప్రజాపాలన దరఖాస్తును గ్రామీణ ప్రాంతాల్లో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో, పట్టణాలు-నగరాల్లో మున్సిపల్ కార్యాలయాల్లో అందించాల్సి ఉంటుంది. వీరి వివరాలను ఆయా కార్యాలయాలు రాష్ట్ర ప్రభుత్వానికి పంపుతాయి. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ పంపిణీ సంస్థలకు పంపగానే వెంటనే వినియోగదారుడి ఫోన్ నంబర్‌కు జీరో బిల్లు మెసేజ్ వెళ్తుంది. జీరో బిల్లుకు సంబంధించిన రాయితీ మొత్తాన్ని ప్రభుత్వం విద్యుత్ పంపిణీ సంస్థలకు చెల్లిస్తుంది. ఈ మేరకు విద్యుత్ పంపిణీ సంస్థ ప్రతి నెల 20న జీరో బిల్లు రాయితీకి సంబంధించిన వివరాలను ప్రభుత్వానికి పంపుతాయి. 200 యూనిట్ల తర్వాత ఒక్క యూనిట్ అధికంగా వినియోగించినా విద్యుత్ వినియోగదారుడు మొత్తం బిల్లు చెల్లించాలి. 200 వరకు మాత్రమే జీరో బిల్లు వస్తుంది. 201 నుంచి జీరో బిల్లు రాదు. ఒక్క యూనిట్ అదనంగా విద్యుత్ వినియోగించినా మొత్తం యూనిట్లకు బిల్లు చెల్లించాలి.

వినియోగదారుల వివరాలు..

జిల్లా	మొత్తం కన్జూమర్స్	గృహజ్యోతి కన్జూమర్స్	బిల్లుల జారీ	జీరో బిల్లుల	జీరో బిల్లు రాని అర్హులు
హనుమకొండ	3,45,302	1,02,156	102156	98464	3692
వరంగల్	2,86,156	1,02,836	102804	99426	3378
భూపాలపల్లి, ములుగు	93,257	77250	74094	72638	1456
జనగామ	1,69,375	78655	78655	77822	833
మహబూబాబాద్	2,09,066	90026	90020	88658	1362

కోర్టులను సద్వినియోగం చేసుకోవాలి



జిల్లా కోర్టు ఎదుట జిల్లా న్యాయమూర్తులతో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, న్యాయమూర్తులు





హనుమకొండ సబ్ కోర్టును ప్రారంభిస్తున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాధే, భద్రకాళి ఆలయంలో ప్రధాన న్యాయమూర్తికి జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ అధికారులు

- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాధే
- వరంగల్ ఏసీబీ, హనుమకొండ సబ్ కోర్టులు ప్రారంభం

వరంగల్ లీగల్ : జిల్లాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కోర్టులను సద్వినియోగం చేసుకోవాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాధే అన్నారు. శనివారం వరంగల్, హనుమకొండ జిల్లాల కోర్టు ప్రాంగణాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన వరంగల్ ఏసీబీ ప్రత్యేక కోర్టు, హనుమకొండ సబ్ కోర్టు (సీనియర్ సివిల్ జడ్జి), ఉభయ జిల్లా ఈ-సేవా కేంద్రం, న్యాయస్థానాల పూర్వ రికార్డుల నిక్షిప్తం కోసం డిజిటలైజేషన్ కేంద్రాన్ని రాష్ట్రంలోనే తొలిసారి ఇక్కడ పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభించినట్లు ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. వరంగల్‌లో ఏర్పాటు చేసిన ఏసీబీ కోర్టు ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల పరిధిలోకి వర్తిస్తుందని (8 జిల్లాలు), ప్రస్తుతానికి ఈకోర్టు పరిధిలోకి 152 కేసులు బదిలీ చేశామని హైకోర్టు జడ్జి, ఉభయ జిల్లా పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ తెలిపారు. దేశంలో పెండింగ్ కేసులు పెద్ద సమస్యని, ఇప్పుడున్న కేసులను ఉన్న పలంగా పరిష్కరించుకోవాలంటే కనీసం 300 సంవత్సరాలు పడుతుందని, అందుకే ప్రత్యామ్నాయ పరిష్కార మార్గాలు ఎంచుకోవాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్.రాజేశ్వర్‌రావు అన్నారు. 'ఈ నేల బిడ్డగా వరంగల్, గోవిందరావుపేట, మహబూబాబాద్ ప్రాంతాల్లో చదువుకున్న నేను 30 సంవత్సరాల అనంతరం వరంగల్ కోర్టు ప్రాంగణానికి రావడం సంతోషంగా ఉందని' జస్టిస్ రాజేశ్వర్‌రావు అన్నారు. డిజిటలైజేషన్ కేంద్రాన్ని యువ న్యాయవాదులు సద్వినియోగం చేసుకోవాలని జస్టిస్ వినోద్‌కుమార్ సూచించారు. ఉభయ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు రాధాదేవి, కృష్ణమూర్తి, బార్ అసోసియేషన్ల అధ్యక్షులు ఆనంద్‌మోహన్, శ్యాంసుందర్‌రెడ్డి, బార్ కౌన్సిల్ సభ్యులు జయాకర్, జనార్దన్, యాకస్వామి, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు. కాగా, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాధే.. భద్రకాళి ఆలయంలో పూజలు నిర్వహించారు.

హైకోర్టు చీఫ్ జస్టిస్‌ను కలిసిన కలెక్టర్లు, సీపీ

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాధేకు హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు సిక్తా పట్నాయక్, సీపీ అంబర్ కిశోర్‌ఝా స్వాగతం పలికారు. అనంతరం చీఫ్ జస్టిస్.. జిల్లా కోర్టు ప్రాంగణంలో పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.

కష్టపడే వారికి ఉద్యోగావకాశాలు మెండు

- వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా



నియమాక పత్రం అందజేస్తున్న సీపీ అంబర్ కిషోర్‌ఝా

విద్యారణ్యపురి : కష్టపడి పని చేసే వారికి ఉద్యోగావకాశాలు మెండుగా లభిస్తాయని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్‌ఝా అన్నారు. శనివారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో టీఎంఐ ఫౌండేషన్ సహకారంతో హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. వెయ్యి కిలోమీటర్ల ప్రయాణం కూడా మొదటి అడుగుతోనే ప్రారంభమవుతుందన్నారు. అలాగే, యువత ఖాళీగా ఉండకుండా తమ విద్యార్హతలను బట్టి తగిన ఉద్యోగం కోసం ఎదురుచూడకుండా వచ్చిన అవకాశాలు అందిపుచ్చుకోవాలన్నారు. వచ్చిన ఉద్యోగంలో తమ ప్రతిభను కనబర్చడం ద్వారా యువత తమ లక్ష్యాలు చేరుకోవచ్చన్నారు. ప్రపంచంలో ఎంతోమంది మేధావులు, వ్యాపారులు వారికి లభించిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని తమ లక్ష్యాలు చేరుకున్నారని గుర్తుచేశారు. అలాంటివారిని ఆదర్శంగా తీసుకుని యువత ముందుకుసాగాలని కోరారు. కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారి, టీఎంఐ ఫౌండేషన్ చైర్మన్ మురళీధరన్, ఏసీపీలు దేవేందర్ రెడ్డి, తిరుమల్, ఇన్‌స్పెక్టర్లు సతీష్, సంజీవ్, సత్యనారాయణరెడ్డి, షుకూర్, కేడీసీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారెడ్డి, ఫౌండేషన్ ప్రతినిధి కృష్ణ తోపాటు వివిధ కంపెనీల హెచ్‌ఆర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాకు అనూహ్య స్పందన

ఈజాబ్‌మేళాకు అనూహ్య స్పందన లభించింది. ఇరువైకి పైగా వివిధ కంపెనీల హెచ్‌ఆర్‌లు వచ్చి అభ్యర్థులకు సంబంధించిన విద్యార్హతలు బట్టి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపిక చేసిన అనంతరం సీపీ అంబర్‌కిషోర్‌ఝా చేతులమీదుగా అభ్యర్థులకు ఉద్యోగ నియమాక పత్రాలు అందజేశారు.

'ఇంటర్ స్పాట్' బహిష్కరణ

- సీఈలుగా నియమించాలని మోడల్ స్కూల్ అధ్యాపకుల ఆందోళన



ఆందోళన చేస్తున్న మోడల్ స్కూల్ అధ్యాపకులు

విద్యారణ్యపురి : హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ జవాబు పత్రాల మూల్యాంకనం మొదటిదశ శనివారం ప్రారంభమైంది. ఇంగ్లిష్, మ్యాథ్స్, పొలిటికల్ సైన్స్, తెలుగు, హిందీ సబ్జెక్టుల జవాబుపత్రాల మూల్యాంకనానికి ఏఈలుగా నియమితులైన అధ్యాపకులు రిపోర్టు చేశారు. ఏఈలుగా ఉండే అధ్యాపకుల సంఖ్యను బట్టి ఒక్కో బోర్డుకు ఒక్కో చీఫ్ ఎగ్జామినర్(సీఈ)ను నియమిస్తారు. అయితే చీఫ్ ఎగ్జామినర్లుగా తమను నియమించడంలో అవకాశం ఇవ్వడం లేదని నిరసిస్తూ ఇంటర్ స్పాట్ కేంద్రం వద్ద ఆయా సబ్జెక్టుల మోడల్ స్కూల్ అధ్యాపకులు ఆందోళనకు దిగారు. వాల్యుయేషన్ చేయకుండా నిరసన చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కాంట్రాక్టు లెక్చరర్లుగా పనిచేసిన వారిని రెగ్యులరైజ్ చేశారని, వారికే చీఫ్ ఎగ్జామినర్లుగా అధికారులు అవకాశం ఇస్తూ ఇంటర్‌బోర్డు సీఈలుగా నియమించిన మోడల్ స్కూల్ అధ్యాపకులకు మాత్రం ఇక్కడి క్యాంపు అధికారులు అవకాశం ఇవ్వడం లేదని ఆరోపించారు. బోర్డు ఆదేశాలను కూడా అధికారులు పాటించటంలేదని వివరించారు. ఈమేరకు స్పాట్‌ను బహిష్కరించి ఆందోళనకు దిగారు. సీఈలుగా ఎంత మంది అవసరమో మిగతా అధ్యాపకులకు ఇచ్చిన రేషియోలో తమకు కూడా అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళన విషయం ఇంటర్ బోర్డు అధికారుల దృష్టికి సైతం వెళ్లింది. మొదటి రోజు వందమందికి పైగా మోడల్ స్కూల్ అధ్యాపకులు స్పాట్‌విధులను బహిష్కరించడంతో క్యాంపు ఆఫీసర్ గోపాల్, ఏసీఓ జనరల్-1 ధర్మేంద్ర మాట్లాడుతూ.. రేషియో ఆధారంగానే సీఈలుగా కేటాయిస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం.

70 శాతం ప్రభుత్వ, 30 శాతం ఇతరులకు..

ఏఈలు, సీఈలుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేసే అధ్యాపకులకు 70శాతం, మోడల్ స్కూల్, సాంఘిక, గిరిజన సంక్షేమ గురుకులాల్లో పనిచేస్తున్న అధ్యాపకులకు 30శాతం కేటాయిస్తారని ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్ కేంద్రం ఏసీఓ జనరల్-1 ధర్మేంద్ర వివరణ ఇచ్చారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కాంట్రాక్టు లెక్చరర్లు 10 నుంచి 15ఏళ్ల సర్వీస్ ఉన్న వారు రెగ్యులర్ అయినందున వారి జీరో సర్వీస్‌గా లెక్కిస్తారన్నారు. అయితే సర్వీస్ ఉండి గతంలో సీఈలు, ఏఈలుగా పనిచేశారన్నారు.ఇంటర్ స్పాట్‌కు రేషియో ప్రకారమే ఏఈలుగా, సీఈలుగా కేటాయిస్తామని తెలిపారు.

సైన్స్ అండ్ టెక్నాలజీలో దూసుకెళ్తున్నాం



కాన్వకేషన్ పత్రం అందజేస్తున్న అతిథులు





మాట్లాడుతున్న ప్రొఫెసర్ అనిల్ సహస్ర బుద్దె, గౌరవ డాక్టరేట్ అందుకుంటున్నచంద్రబోస్, చిత్రంలో అనిల్ సహస్ర బుద్దె, ఎ.వరదారెడ్డి

- కఠోర శ్రమతోనే కలల సాకారం
- ప్రొఫెసర్ అనిల్ సహస్ర
- ఎస్సార్ యూనివర్సిటీలో ఘనంగా స్నాతకోత్సవం
- డిగ్రీలు, పీహెచ్‌డీల ప్రదానం

హసన్‌పర్తి : సైన్స్ అండ్ టెక్నాలజీలో ముందుకు దూసుకెళ్తున్నామని ఎగ్జిక్యూటివ్ కమిటీ నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ అనిల్ సహస్ర బుద్దె అన్నారు. చంద్రయాన్, థోరియం రియాక్టర్లు, వందేభారత్‌రైలు ఇందుకు ఉదాహరణగా పేర్కొన్నారు. శనివారం నగర శివారులోని ఎస్సార్ యూనివర్సిటీలో ప్రథమ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి అనిల్ సహస్ర బుద్దె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కఠోర శ్రమతోనే కలలు సాకారమవుతాయని, విద్యార్థులు నూతన ఆవిష్కరణాల వైపు దృష్టి సారించాలన్నారు. ఎన్ఈపీ 2020 పాలసీ ఇండియన్ ఎడ్యుకేషన్ పాలసీలో మార్పులు తెస్తోందన్నారు. ఎస్సార్ విద్యాసంస్థలు నాణ్యమైన విద్యకు మారుపేరుగా పేర్కొన్నారు. ఎస్సార్ యూనివర్సిటీ వైస్ చైర్మన్ డాక్టర్ దీపక్ గార్గ్ మాట్లాడుతూ తల్లిదండ్రుల సహకారంతోనే విద్యార్థులు జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని వివరించారు. ఎస్సార్ యూనివర్సిటీ చైర్మన్ ఎ. వరదారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో ప్రముఖ సినీగేయ రచయిత సుభాష్ చంద్రబోస్, ఎస్సార్ యూనివర్సిటీ ప్రొ చాన్సలర్ మధుకర్‌రెడ్డి, రిజిస్ట్రార్ అర్చనారెడ్డి, ప్రోగ్రాం కన్వీనర్ ప్రొఫెసర్ గురురావు,డాక్టర్ మహేష్, డాక్టర్ కిరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

చంద్రబోస్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం

ప్రముఖ సినీ గేయ రచయిత చంద్రబోస్‌కు ఎస్సార్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. యూనివర్సిటీలో శనివారం జరిగిన ప్రథమ స్నాతకోత్సవంలో చైర్మన్ ఆఫ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ ప్రొఫెసర్ అనిల్ సహస్ర బుద్దె చేతుల మీదుగా చంద్రబోస్ గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. చంద్రబోస్ మాట్లాడుతూ తాను చదువుకున్న కళాశాల తనను గౌరవ డాక్టరేట్‌తో గౌరవించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా 'మౌనంగానే ఎదగమని మొక్క నీకు చెబుతోంది.. ఎదిగిన కొద్ది ఒదగమని' అనే పాట పాడి వినిపించారు.

చోటేబాయి.. బడే బాయి మిలాఖత్



ధర్నా చేస్తున్న వినయ్ భాస్కర్, తదితరులు

హన్మకొండ: చోటే బాయి... బడేబాయి మిలాఖత్ అయ్యారని (సీఎం రేవంత్ రెడ్డి, ప్రధాని మోదీని ఉద్దేశించి) బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఈడీ అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ శనివారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయం నుంచి కాళోజీ కూడలి వరకు నల్ల జెండాలు పట్టుకుని బ్యాడ్జీలు ధరించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల అధికారంలో ఉండి అనేక హామీలు ఇచ్చిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం.. ఆ వాగ్దానాలను నెరవేర్చకపోవడంతో ప్రజల్లో ఆ పార్టీ పట్ల తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. తెలంగాణ సంస్కృతిని కాపాడుతున్న మాజీ సీఎం కేసీఆర్ కుమార్తె కవితను ఈడీ అకారణంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, జెడ్పీ చైర్మన్ సుధీర్ కుమార్, 'కుడా' మాజీ చైర్మన్లు సుందర్ రాజు యాదవ్, మర్రి యాదవ రెడ్డి, వరంగల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కడియం కావ్య, నాయకులు పులి రజనీకాంత్, తాళ్లపల్లి జనార్దన్ గౌడ్, సోదా కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నన్ను వేధిస్తున్నాడు..

- ఉన్నతాధికారులకు మత్స్యశాఖ మహిళా ఉద్యోగి ఫిర్యాదు
- కలెక్టర్ ఆదేశాలతో రంగంలోకి విచారణ కమిటీ

హన్మకొండ చౌరస్తా : విధి నిర్వహణలో తనను కులం పేరుతో దూషిస్తూ, మానసికంగా వేధిస్తున్నాడంటూ మత్స్యశాఖలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్న ఓ మహిళా ఉద్యోగి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. సుమారు 20 రోజుల క్రితం చేసిన ఫిర్యాదును స్వీకరించిన హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్.. ప్రత్యేక విచారణ కమిటీని నియమించింది. నలుగురు జిల్లా స్థాయి మహిళా అధికారులతో కూడిన కమిటీ బృందం హనుమకొండ ములుగురోడ్ సమీపంలోని మత్స్యశాఖ కార్యాలయంలో విచారణ చేపట్టింది. సదరు అధికారి తీరుపై కింది స్థాయి సిబ్బంది, ఉద్యోగులను అడిగి తెలుసుకున్న విచారణ బృందం.. నివేదికను కలెక్టర్‌కు అందించినట్లు సమాచారం.

అసలేం జరిగింది?

హనుమకొండ ములుగురోడ్ సమీపంలోని అజరా ఆసుపత్రి వెనుక వరంగల్, హనుమకొండ జిల్లాల మత్స్యశాఖ కార్యాలయాలు కొనసాగుతున్నాయి. హనుమకొండ జిల్లా మత్స్యశాఖ అధికారిగా డాక్టర్ విజయభారతి, వరంగల్ జిల్లా అధికారిగా నరేష్‌నాయుడు ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్నారు. కూతురు పెళ్లి ఉండడంతో విజయభారతి సెలవులో వెళ్లారు. దీంతో ప్రభుత్వం నరేష్‌నాయుడుకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించింది. హనుమకొండ జిల్లా కార్యాలయంలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్న ఓ మహిళా ఉద్యోగి అదే కార్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తోంది. ఆమెను సదరు జిల్లా అధికారి రోజు నిర్వహించే విధులు కాకుండా మరో చోటుకు వెళ్లాలని ఒత్తిడి తీసుకువచ్చేవాడని తెలిసింది. దీంతో పూర్తిస్థాయిలో విధుల్లో ఉన్న మహిళా అధికారి.. విజయభారతి చెప్పిన పనులను చేస్తానని చెప్పడంతో నొచ్చుకున్న సదరు అధికారి కులం పేరుతో దూషించడంతో పాటు మానసికంగా వేధించేవాడని, దాదాపు వారం రోజుల పాటు ఓపిక పట్టిన మహిళా ఉద్యోగి ఎట్టకేలకు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్ విచారణ కమిటీని నియమించింది. ఈ కమిటీ విచారణ చేపట్టి రిపోర్టును కలెక్టర్, మత్స్యశాఖ కమిషనర్‌తో పాటు ప్రిన్సిపల్ సెక్రటరీకి అందజేసినట్లు సమాచారం.

న్యాయం జరుగుతుందనే నమ్మకం ఉంది

నరేష్‌నాయుడు ఇన్‌చార్జ్ బాధ్యతలు తీసుకున్న మొదటి నుంచి నన్ను టార్గెట్ చేస్తూ మాట్లాడేవాడు. అతడు చెప్పినట్లు వినకపోవడంతో కులం పేరుతో అసభ్యంగా మాట్లాడుతూ వేధించేవాడు. నన్నే కాదు ఆఫీసులో ఇతర మహిళలనూ ఇలాగే వేధిస్తాడని వారు నాతో చెప్పారు. విచారణ కమిటీలో నిజాలు చెప్పారు. ఆ అధికారి పై చర్యలు తీసుకుని న్యాయం చేస్తారనే నమ్మకం ఉంది.

\- బాధిత మహిళా ఉద్యోగి

విచారణ రిపోర్టు కమిషనర్ దగ్గర ఉంది

విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని చెప్పినందుకు నేను వేధిస్తున్నానంటూ సదరు మహిళా ఉద్యోగి ఫిర్యాదు చేశారు. విచారణ కోసం ఇటీవల అధికారుల బృందం ఆఫీసుకు వచ్చారు. విచారణ రిపోర్టును కలెక్టర్, మత్స్యశాఖ కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రటరీ కి అందించినట్లు తెలిసింది.

\- నరేష్ నాయుడు, జిల్లా మత్స్యశాఖ అధికారి, వరంగల్